
# 'చిన్న'కథ



మలయాళం- ఎం. ముకుందన్

అనువాదం- దాసరి అమరేంద్ర

''చిన్నా! ఓ చిన్నా! కథ చెప్పయ్యా'' కేకేసింది అమ్మమ్మ.

అప్పుడే భోజనం ముగించి ఆకూ వక్కా బుగ్గన బిగించి తనివిదీరా నవులుతూ చిన్నాకోసం ఎదురుచూస్తోంది. వాడి కథ వినందే నిద్రపట్టదు మరి. తెరిచి వున్న తలుపుగుండా తొంగి చూస్తూ పిలిచింది ''దా నాయనా దా''

కథ కోసం తహతహలాడుతోంది అమ్మమ్మ.

''చిన్నా చదువుకొంటున్నాడు'' చెప్పింది చిన్నావాళ్ళమ్మ.

చిన్ని రెండో క్లాసు. స్కూల్లో పాఠాలు జోరుగా సాగిపోతున్నాయి.

''ఓ చిన్ని కథమ్మా'' బతిమాలింది అమ్మమ్మ.

''చిన్నకథ''

మంచం మీద కాళ్ళారజాపుకొని గోడకానుకుని కూర్చుని ఉంది అమ్మమ్మ. కరెంటు దీపపు గుడ్డివెలుతురు గదంతా పరచుకొని ఉంది.

''ఏవిటమ్మా! ఇపుడు చిన్నా నీకు కథెలా చెబుతాడూ? వాడికింకా చదవాల్సిందెంతో ఉంది. హోం వర్క్ వలేదు''

''మా తల్లివిగదూ! ఈ ఒక్కసారీ చెప్పనివ్వు. ఇంకెప్పుడూ అడగను''

''నిన్నా ఇదే మాటన్నావు...''

అమ్మమ్మ తప్పు చేసినట్టుగా చూపులు మరల్చింది.

బాగా పెద్దదయిపోయింది అమ్మమ్మ. ఒంట్లో వణుకు. జవసత్వాలుడిగిపోయి ఓ చిన్నపిల్లాడి ప్రమాణానికి శుష్కించిపోయింది.

చిన్నా వాళ్ళమ్మకు ప్రాణం ఉసూరుమనిపించింది.

''చిన్నా! వెళ్ళి అమ్మమ్మకు కథ చెప్పేసిరా. అమ్మమ్మ నిద్రపోగానే మళ్ళీ వచ్చి హోంవర్క్ చెయ్యి''

అమ్మమ్మ తొందరగా నిద్రపోతే బావుణ్నని కోరుకొన్నాడు చిన్నా.

అప్పుడే తొమ్మిదిన్నర అయిపోయింది.

చిన్నా వచ్చి పక్కన కూర్చోగానే అమ్మమ్మ మొహం చాటంత అయింది.

కథ వినందే నిద్రపట్టదు మరి. అదో అలవాటయిపోయింది. వ్యసనమయిపోయింది. అది తనకు అలవిగాని విషయమయిపోయింది.

''ఏం కథ చెప్పమంటావమ్మమ్మా?''

''ఏదన్నా మంచి కథ. వింటే నిద్రపట్టెయ్యాలి మరి''

''గాజుచెట్టు కథ చెప్పనా?''

''ఊ...''

అమ్మమ్మ ఒళ్ళో దూరి చిన్నా ఎదురుగావున్న గోడకేసి తేరిపార చూశాడు. గోడ బోసిగా ఉంది. పటం కట్టించిన ఫొటోలుగానీ అలంకరణ కోసం అమర్చిన షోపీసులుగానీ లేనేలేవు.

పొట్టిగా కుదిమట్టంగా చెవులకు బంగారపోగులు పెట్టుకొన్న ఓ మనిషి ఆ గోడ మీద మొట్టమొదట కనబడిన చిత్రం. ఆ మనిషి బొద్దువేళ్ళకున్న ఉంగరాలన్నీ బంగారపువే.

''చూడు అమ్మమ్మా! ఆయన కురుమన్ మేస్త్రీ''

గోడ మీద అట్నించిటు ఓ పల్లకీ సాగిపోయింది. విసనకర్ర చేతపట్టుకొని కుమరన్ మేస్త్రీ పల్లకీలో పవ్వళించి ఉన్నాడు. చుట్టూ మందీమార్బలం... ముందు దీపం పట్టుకొని నడిచే సేవకుడూ... వీధి లాంతరు వెలుగు పల్లకీ ముందు భాగంమీద పడి ఓ బంగారువన్నె మరకలా మెరుస్తోంది.

''చిన్నా! కురుమన్ మేస్త్రీ ఎక్కడికి పోతున్నాడురా?''

''చంపక కావిలమ్మ కోవెలలో పూజ చేయడానికి''

ఆ తెల్లని బోసిగోడ మీద ఓ బ్రహ్మాండమైన చంపక వృక్షం కానవచ్చింది. పచ్చని చిక్కని ఆకుల మాటున కొమ్మలన్నీ కప్పడిపోయి ఉన్నాయి. చెట్టంతా పువ్వుల భారంలో వంగిపోయినట్టనిపిస్తోంది. చుట్టుపక్కలంతా పువ్వుల పరిమళం దట్టంగా వ్యాపించి ఉంది.

బోయీలు మెల్లగా పల్లకీని చంపక వృక్షం దగ్గర దింపారు. కురుమన్ మేస్త్రీ పల్లకీ దిగాడు. ఓ సేవకుడు విసనకర్ర అందుకొని పల్లకీలో పెట్టాడు. ప్రాతఃకాలపు చల్లగాలికి ఆకులు గలగలలాడాయి. సర్వకాల సర్వావస్థల్లోనూ - ఆఖరికి వర్షంపడ్డ రోజున కూడా - కురుమన్ చేతిలో విసనకర్ర తప్పనిసరి.

చంపక వృక్షం మొదట్లో జిడ్డుబారిన రాతివిగ్రహాల ముందు చేతులు జోడించి నిలిచాడు కురుమన్. ఓ పాత ప్రమిదలోంచి వస్తోన్న వెలుతురు ఆ ముసలివృక్షపు మెలిదిరిగిన వేళ్ళ మీద పడి ప్రతిఫలిస్తోంది.

''చిన్నా! ఆ వచ్చేదెవరూ?'' అడిగింది అమ్మమ్మ.

మంచి బట్టలు వేసుకొన్న పెద్ద మనిషొకతను ఆ తెల్లగోడమీద ప్రత్యక్షమయ్యాడు. చొక్కా వేసుకొని ఉన్నాడు. అంతా జడలు పెంచుకొని ముడులు వేసుకొనే ఆనవాయితీ ఉన్న ఆ ప్రాంతంలో అతగాడి క్రాఫింగు జుట్టు వింతగా ఉంది.

''అతణ్ని మెల్కోరన్ అంటారు. గుళ్ళూ మసీదులూ కడుతూ ఉంటాడు''

మెల్కోరన్ కుమరన్ మేస్త్రీ దగ్గరకి వెళ్ళి చేతులు జోడించి వంగి నమస్కారం చేశాడు.

తూరుపుదిక్కున వెలుగురేకలు కానవస్తున్నాయి.

''ఎవరివయ్యా నువ్వూ?''

''అయ్యా నేను పడమటి దేశంవాడిని. తాపీపనివాడిని. నా పేరు మెల్కోరన్''

''ఏం కావాలీ?''

''పని''

కురుమన్ మేస్త్రీ తమ పెద్ద గుమస్తాకేసి చూశాడు. వీధి లాంతరు వెలుగులో పెద్ద గుమస్తా తల అడ్డంగా ఊపడం కనిపించింది.

చంపక వృక్షపు కొమ్మలమాటున కలకలం వినబడింది. రంగురంగుల రెక్కలున్న కరదన్ పిట్టలు నిద్రలో మెదిలాయి. ఆ పిట్టల మెత్తటి గడ్డి గూళ్ళలో వున్న గుడ్లు గాలితో గుసగుసలాడాయి.

''మెల్కోవా... నీకిక్కం పనేం లేదయ్యా'' చెప్పాడు కురుమన్ మేస్త్రీ. ''వెళ్ళి పక్క ఊళ్ళోల్లో ప్రయత్నం చెయ్యి''

''మహాప్రభో! నాకు తగిన పని సరిగ్గా ఇక్కడే ఉంది'' గౌరవసూచకంగా వంగి అన్నాడు మెల్కోరన్.

విషయమర్థంగాక కురుమన్ మేస్త్రీ పెద్ద గుమస్తాకేసి చూశాడు.

''ఆ చెట్టు చూడండి. ముసలిదయిపోయి మోడుబారిపోతోంది. కావిలమ్మ కోవెలకు నీడనిచ్చే శక్తి కోల్పోతోంది. అంచేత ఆ చెట్టును కొట్టేసి కొత్త చెట్టు కడదాం'' అన్నాడు మెల్కోరన్.

''అది జరిగే పనేనా?''

''ఎందుకు గాదూ? ఎప్పటికీ వయస్సుమళ్ళని చెట్టును నే నిర్మించగలను. దాని ఆకులు రాలనే రాలవు''

''అసలల్లాంటి చెట్టెక్కడయినా ఉందా మెల్కోవా?''

''పడమటి దేశంలో ఉంది''

''సరే. మంచిది. మనకీ అల్లాంటి చెట్టు ఒకటి ఉంటే బావుంటుంది. వెంటనే నీ పని ప్రారంభించు'' కురుమన్ మేస్త్రీ అనుజ్ఞ ఇచ్చాడు.

మెల్కోరన్ ఎంతెంత వంగి వంగి దండాలు పెట్టాడంటే... అతని తల నేలను తాకేసింది. అతి మర్యాదగా అడుగులో అడుగువేసుకొంటూ వెనక్కి మళ్ళి చీకటిలో కలిసిపోయాడు.

కురుమన్ మేస్త్రీ పల్లకీ ఎక్కాడు. ఓ సేవకుడు విసనకర్ర అందించాడు. మందీమార్బలం తోడురాగా ఓ సేవకుడు దీపం చేతబట్టి ముందు నడవగా పల్లకీ కురుమన్ మేస్త్రీ భవంతి చేరింది.

సూర్యోదయ సమయం. చెట్లన్నీ తళతళలాడసాగాయి. వీధి దీపంలో నూనె నిండుకోబోతోంది.

''చిన్నా. వాళ్ళు చంపక వృక్షాన్ని కొట్టేస్తారా?'' అమ్మమ్మ ఆందోళన!

చెట్టుకూలిన శబ్దం వినబడింది.

భూదేవంత పురాతనమైన ఆ చంపకం చెట్టును పడగొట్టిన తర్వాత మెల్కోరన్ గొడ్డలి పక్కనపెట్టి ఓ బండరాతిమీద కూర్చొని అలసట తీర్చుకొన్నాడు. చెట్టుకూలిన ధ్వని విని పిట్టలన్నీ బిలబిలా వచ్చి చేరాయి. తమతమ గూళ్ళనూ గుడ్లనూ పోగొట్టుకొన్న సంగతి గ్రహించి గోలగోలగా నిస్సహాయంగా ఆ కూలిన వృక్షం చుట్టూ చెక్కర్లు కొట్టాయి. వాటిల్ని అదిలించే ప్రయత్నం చేసాడు మెల్కోరన్. చేతినిండా గులకరాళ్ళు తీసుకొని విసిరాడు. అయినా ఆ పిట్టలు చాలాసేపు కూలిన వృక్షం చుట్టూ తిరుగుతూ ఉండిపోయాయి.

''అయ్యో చిన్నా! ఎంత పని జరిగిపోయిందీ'' నిట్టూర్చింది అమ్మమ్మ.

చిన్నా కథ కొనసాగించాడు.

గోడమీద మెల్కోరన్ బొమ్మ మళ్ళీ కనిపించింది. కొత్త చెట్టు నిర్మాణంలో నిమగ్నమై కనిపించాడు. అతని చుట్టూ అతను చల్లని శీతల జలాలను తాగి పారేసిన కొబ్బరి బోండాలున్నాయి. తరచూ కురుమన్ మేస్త్రీ విసనకర్ర చేతబట్టుకొని పల్లకీలో వచ్చిపోతున్నాడు. కొబ్బరిని కోరినంత సులువుగా గాజుదిమ్మలను చెక్కుతోన్న మెల్కోరన్ పనితీరును చూసి విస్తుపోతున్నాడు. చంపక కావిలమ్మ ముంగిట గాజు తునకలు గుట్టలుగా పడి ఉన్నాయి. తళతళ మెరుస్తోన్న ఆ గాజు తునకలలో నల్లపాటి శరీరాల అలగా పిల్లలు ఆటలాడుతున్నారు. అపుడపుడు వేళ్ళు కోసుకుంటున్నారు.

''అయ్యో చిన్నా వాళ్ళకి రక్తమొస్తోందా?'' బాధపడింది అమ్మమ్మ.

ముందస్తుగా వేళ్ళూ కాండం చెక్కాడు మెల్కోరన్. తర్వాత కొమ్మలు చెక్కాడు. ఆకులూ పువ్వులూ మాత్రమే మిగిలిపోయాయి. ఆకుల కోసం పచ్చగాజూ, పువ్వుల కోసం తెల్లగాజూ అవసరమయ్యాయి.

అమ్మమ్మ ఆ బోసి చెట్టుకేసి తేరిపారచూసింది.

''చిన్నా! నీ హోంవర్క్ చేసుకోవూ? అప్పుడే పది దాటేసింది'' పిలిచింది అమ్మ.

''అయిపోయిందమ్మా. చివరికొచ్చేసాం''

''తొందరగా అవగొట్టు''

కథ అయిపోవస్తోందని విని అమ్మమ్మ మొహం వాడింది. నిద్ర జాడేలేదు. ఇంకా పూర్తిగా రాత్రే అవలేదు!

''చిన్నా! గబగబా చెప్పేయక'' చిన్నా చెవిలో గుసగుసలాడింది.

చిన్నా వడి తగ్గించాడు.

ఆకులూ పువ్వులూ చెక్కడానికి చాలాకాలం పట్టింది మెల్కోరన్‌కు. ప్రతి ఆకునూ ప్రతీ పువ్వునూ ఎంతో జాగ్రత్తగా, నైపుణ్యంతో తీర్చిదిద్దాడు. కురుమన్ మేస్త్రీ విసనకర్ర చేత ధరించి మెల్కోరన్ పనితీరును వీక్షిస్తూనే ఉన్నాడు. గాజు తునకలతో వేళ్ళు కోసుకొన్న చీమిడిముక్కుల అలగా పిల్లలు మళ్ళీ ఆ చుట్టుపక్కల గుమిగూడుతూనే ఉన్నారు.

''చిట్టచివరికి ఏణ్నర్థం తర్వాత చెట్టు పని పూర్తయింది'' చెప్పాడు చిన్నా.

కురుమన్ మేస్త్రీ ఆ అద్భుత వృక్షాన్ని చూసి చేష్టలుడిగి ఉండిపోయాడు. ఉషఃసంధ్యా సమయాలలోని కెంజాయ రంగులలో ఆ పారదర్శకమైన వృక్షం ఓలలాడింది. ఆకుపచ్చని గాజుటాకులూ తెల్లపాటి గాజు సుమాలూ సూర్యకాంతిలో ధగధగలాడసాగాయి. అల్లాంటి అపురూపమైన వృక్షం కురుమన్ మేస్త్రీకే తగింది. ఆయనకు గర్వకారణంగా రూపొందింది.

కురుమన్ మేస్త్రీ మెల్కోరన్‌ను అమూల్యమైన బహుమతులతో ముంచెత్తారు.

ఆ గాజువృక్షం అపురూపమైనదే. కానీ దాని పువ్వులలో సువాసనలు లేవు. దాని కొమ్మలలో ధగధగమెరిసే పక్షి గూళ్ళున్నాయి గానీ ఆ గూళ్ళలో గుడ్లు లేవు. పక్షులు లేవు. రంగురంగుల రెక్కల పక్షులు నివసించడాలు లేవు.

చివరికి చిన్నా కథ పూర్తయింది. కథ ముగించి చిన్నా అమ్మమ్మకేసి చూశాడు. అమ్మమ్మ అప్పటికే గోడకు చేరబడి గాఢనిద్రలో మునిగిపోయింది.

★